# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 7-10-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:27 | సంచిక:55 | పేజీలు: 4 | వెల: రూ.1/-





### మధ్యప్రదేశ్,యూపిల్లో ఘోరరోడ్డు ప్రమాదం

# వేర్వేరు ప్రమాదాల్లో 11మంది మృత్యువాత

భోపాల్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్,యూపిల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 11మంది దుర్మరణం చెందారు. పలువురు గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉపాధి కోసం వెళున్న కార్మికులను గ్యాస్ ట్యాంకర్ రూపంలో వచ్చిన మృత్యువు వారిని కబళించింది. ధార్ జిల్లాలోని ఇండోర్-అహ్మదాబాద్ రహదారిపై తిర్లా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని చిఖాలియా ఫటా వద్ద సోయాబీన్ వంట సేకరించే 20 మందికిపైగా కార్మికులతో నిండిన వ్యాన్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన డ్రైవర్ నిలిపివేశారు. అటు వైపుగా వెనుక నుంచి వచ్చిన గ్యాస్ ట్యాంకర్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంలో కూర్చున్న ఆరుగురు కార్మికులు అట్టడికక్కడే

మృత్యువాతపడ్డారు. మరో 14 మంది గాయపడ్డారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స కోసం ఇండోర్ దవాఖానకు తరలించారు. సంఘటన సమాచారం అందుకున్న పోలీసు సూపరింటెండెంట్ ఆదిత్య ప్రతాప్ సింగ్, సీఎస్పీ దేవేంద్ర కుమార్, ధుర్వే సీఎస్పీ తరుణ్ సింగ్ బాగెల్, తిరాలా పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ రంజిత్ సింగ్ బాగెల్ సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీస్ సూపరింటెండెంట్ క్షతగాత్రులను చికిత్స కోసం తన వాహనంలోనే దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబాలకు కలెక్టర్ సింగ్ అలోక్‌సింగ్ ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ ఘటనలో బాల కార్మికులతో సహా 6 మంది మృతి చెందారు. కాగా పెద్ద సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు.

#### యూపి ప్రమాదంలో ఐదుగురు మృతి

ఎదురెదురుగా వేగంగా వస్తున్న రెండు కార్లు డియోరియా జిల్లా బ్రిడ్జిపై ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మరణించిన ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని డియోరియా జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. లార్-సలీంపూర్ రోడ్డుపై వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి ఓ మోటారుబైక్, స్కూటరిస్టుతోపాటు మరో కారును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు మరణించారు. మృతుల్లో డియోరియా పట్టణానికి చెందిన ఇద్దరు, గోరఖ్ పూర్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. మరో వ్యక్తిని గుర్తించాల్సి ఉంది. వంతెనపై అతివేగం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వ్యవసాయ చట్టాలతో ఆహారభద్రతకు ముప్పు

### మోడీ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ పతనం

### ప్రధాని నిర్లక్ష్యం వల్లనే చైనా దురాక్రమణలు : రాహుల్

చండీఘడ్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం ఉన్న ఆహారభద్రతా వ్యవస్థను కొత్త వ్యవసాయ చట్టాలతో మోదీ సర్కార్ నాశనం చేస్తున్నదని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశానికి వెన్నుముక అయిన చిన్న, మధ్య తరహా వ్యాపారాలను లాక్‌డౌన్ వేళ మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దీని వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదన్నారు. నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ పాటియాలాలో మీడియాతో మాట్లాడారు. మోదీ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఉద్యోగకల్పన కూడా పడిపోయిందన్నారు. ఆహార భద్రతకు సంబంధించిన ప్రస్తుతం ఉన్న వ్యవస్థను మోదీ ప్రభుత్వం రైతు బిల్లులతో ధ్వంసం చేసిందని రాహుల్ విరుచుకుపడ్డారు. ముఖ్యంగా పంజాబ్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇది నిస్సందేహంగా రైతులపై జరిపిన దాడేనని అన్నారు. మన భూభాగాన్ని చైనా ఎందుకు ఆక్రమించిందో తెలుసా, ఎందుకంటే ప్రధాని మోదీ గురించి చైనాకు తెలుసు అని, మోదీ కేవలం తన ఇమేజ్ గురించి ఆలోచిస్తారని, ఇతర అంశాలను పట్టించుకోడన్న విషయం చైనాకు తెలుసన్నారు. భారత భూభాగంలో చైనా ఆక్రమణలకు సంబంధించి రాహుల్ గాంధీ కేంద్రంపై మరోసారి విమర్శలు గుప్పించారు. భారత భూభాగంలోని కొంత భాగాన్ని చైనా ఎలా ఆక్రమించగలిగిందో మీకు తెలుసా? ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి (మోదీ) కేవలం తన ఇమేజ్ గురించే చూసుకుంటారనే విషయం చైనాకు బాగా తెలుసునని వ్యంగ్యోక్తులు విసిరారు. కోవిడ-19 గురించి ఫిబ్రవరిలోనే వార్నింగ్ ఇచ్చానని, కానీ తాను జోక్ చేస్తున్నట్లు ఆరోపించారన్నారు. తలాక్‌డౌన్ సమయంలో కార్మికుల దయనీయ పరిస్థితులు ఎదుర్కొన్నారని, భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిస్తూ, లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మోదీ ప్రభుత్వం దారుణంగా దెబ్బ తీసిందని రాహుల్ విమర్శించారు. ఫిబ్రవరిలోనే తాను కోవిడ్-19 గురించి హెచ్చరించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం జోక్ చేస్తున్నానంటూ తన మాటలను ఏమాత్రం ఖాతరు చేయలేదని అన్నారు. హత్రాస్ ఘటనపైన కూడా స్పందించిన రాహుల్.. ఆ దళిత యువతి కుటుంబం ఒంటరిగా లేదని, వారి వెంట తాము ఉన్నామన్నారు. ఆ కుటుంబాన్ని మొత్తం యావత్ యూపీ సర్కార్ టార్గెట్ చేసిందన్నారు. కానీ ఆ సంఘటన పట్ల ఇంత వరకు ప్రధాని మోదీ ఏమీ మాట్లాడ లేదన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఏమాత్రం ఒంటరి వాళ్లు కాదనే విషయం తాను చెప్పదలచుకున్నానని, తాము వారికి అండగా ఉన్నామని అన్నారు.

# రాయదుర్గం డీఎన్ఆర్ హిల్స్‌లో భారీ చోరీ

### ఇంట్లో పనిచేస్తున్న నేపాలీల దురాగతం

### యజమాని కుటుంబానికి ఆహారంలో మత్తు

### నగదు,నగలతో పరార్..గాలిస్తున్న పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ శివారు రాయదుర్గం డీఎన్ఆర్ హిల్స్‌లో భారీ చోరీ జరిగింది. బోర్‌వెల్ కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి ఇంట్లో రూ. 15 లక్షలు, 5 తులాల బంగారాన్ని అపహరించారు.

మధుసూదన్ రెడ్డి ఇంట్లో పని చేసే నేపాల్ వాసులే ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ చోరీ కేసుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. గత కొంతకాలం నుంచి మధుసూదన్ ఇంట్లో నలుగురు నేపాల్ వాసులు పని చేస్తున్నారు.

రాజేందర్ అలియాస్ రవి, ఆయన మేనకోడలు సీత, బంధువులు జానకి, మనోజ్ కలిసి మధుసూదన్ రెడ్డి ఇంట్లో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం సోమవారం రాత్రి చపాతీల్లో మత్తుమందు కలిపి కాంట్రాక్టర్ కుటుంబ సభ్యులకు వడ్డించారు.

ఈ ఆహారం తినడంతో మధుసూదన్ రెడ్డితో పాటు ఆయన భార్య, కుమారుడు, కోడలు, మనవడు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అనంతరం నలుగురు కలిసి యజమాని ఇంట్లో ఉన్న రూ. 15 లక్షల నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆధారాలు లేకుండా సీసీటీవీ డీవీఆర్‌తో పాటు బాధితుల సెల్‌ఫోన్లను కూడా దొంగిలించారు. నిందితులు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు సమాచారం. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతో పాటు సరిహద్దు ప్రాంతాలను గాలిస్తున్నాం.

త్వరలోనే నిందితులను పట్టుకుంటామని డీసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ప్రధాని మోడీతో జగన్ 40 నిముషాల పాటు భేటీ

### -రాష్ట్ర సమస్యలపై మోడీకి వివరించిన జగన్

న్యూఢిల్లీ,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): ఏపీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, కరోనా పరిస్థితులు, విభజన హామీలు, రాష్ట్రానికి అందాల్సిన నిధులు, బకాయిలు వంటి అంశాలపై సీఎం జగన్ ప్రధాని మోదీతో చర్చించారు. మొత్తం 17 అంశాలను జగన్ ప్రధానికి నివేదించారు. ప్రత్యేకంగా, జీఎస్టీ చెల్లింపులు, రాష్ట్ర విభజన హామీలపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు నిధులు, దిశ సహా కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న ఏపీ బిల్లులపైనా ఆయన ప్రధానికి తెలియజేశారు. దాదాపు సీఎం జగన్ ప్రతిపాదనలన్నింటికీ ప్రధాని మోడీ నుంచి సానుకూల స్పందన వచ్చిందని సమాచారం.

రాష్ట్ర అభివృద్ధి అజెండాగా ఈ సమావేశం జరిగింది. ప్రధాని మోదీతో భేటీ అనంతరం కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి జల వివాదాల పరిష్కారానికి వీలుగా కేంద్ర జల శక్తి శాఖ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సీఎం జగన్ వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, లోక్‌సభలో పార్టీ విప్ మార్గాని భరత్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు ఉన్నారు. ఇదిలావుంటే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో మల్లికార్జున్ రావు, సీజీఎం చందర్ ఖురానా మర్యాదపూర్వకంగా కలిశారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ దుర్గగ - సతతము సాయుధ
వర్గములో నిలచి తెల్ల వారిని గూల్చన్
దుర్గము పథమున నడచిన
"దుర్గాబాయి" ని గాంచుము దౌర్బ్యాగమారన్ !!

-రాధశ్రీ

సెల్: 9494481210



( అక్టోబర్ 7 దుర్గాబీభీ జయంతి..)

# దేశవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న కరోనా

### ఐదు రాష్ట్రాల్లో మాత్రం యతాతథంగా పెరుగుదల

న్యూఢిల్లీ,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కరోనా కేసులు తగ్గుతున్నప్పటికీ, ఐదు రాష్ట్రాల్లో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. గడచిన మూడు వారాల్లో దేశ వ్యాప్తంగా కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. కేరళ, ఛత్తీస్ గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లలో సెప్టెంబరు 13 నుంచి అక్టోబరు 4 మధ్యకాలంలో అత్యధికంగా కరోనా కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా చూస్తే గడచిన మూడు వారాల్లో కరోనా కేసుల వృద్ధి 36 శాతానికి తగ్గింది. కర్నాటకలో కరోనా కేసుల వృద్ధి 39 శాతంగా ఉంది. మరోవైపు దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది.. వరుసగా కరోనా కేసులు పెరుగుతూ ఆందోళన చెందుతున్న సమయంలో.. గుడ్‌న్యూస్ చెబుతూ.. పాజిటివ్ కేసుల సంఖ్య కూడా కాస్త తగ్గింది.. కేంద్ర ఆరోగ్యశాఖ విడుదల చేసిన తాజా కరోనా హెల్త్ బులెటిన్ ప్రకారం.. గత 24 గంటల్లో దేశ్యాప్తంగా 61,267 కొత్త పాజిటివ్ కేసులు నమోదయ్యాయి, 884 మంది మృతిచెందారు. దీంతో.. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 66,85,083కు చేరుకున్నాయి... ప్రస్తుతం దేశవ్యాప్తంగా 9,19,023 యాక్టివ్ కేసులు ఉండగా... 56,62,491 మంది కరోనాబారినపడి కోలుకున్నారు. ఇక, ఇప్పటి వరకు కరోనాతో 1,03,569 మంది మృతిచెందారు. మరోవైపు.. సోమవారం రోజు 10,89,403 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు ఐసీఎంఆర్ ప్రకటించింది.. దీంతో.. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా టెస్ట్‌ల సంఖ్య 8,10,71,797కు చేరినట్టు పేర్కొంది ఐసీఎంఆర్.

## అనారోగ్యంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే మృతి

### కరోనా నుంచి కోలుకున్నా తప్పని మరణం

జైపూర్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కైలాష్ చంద్ర త్రివేది (65) గుర్గావ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు, పార్టీ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఇటీవల ఆయన కరోనా మహమ్మారి బారినపడి కోలుకున్నారు.

ఆయతే ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ గుర్గావ్‌లో మరణించారు. జైపూర్‌లో కరోనా వైరస్ నుంచి కోలుకున్న తర్వాత ఆరోగ్య సమస్యలతో త్రివేదిని ఎస్ఎంఎస్ దవాఖానలో చేర్పించినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. సహారా (భిల్వారా) నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు త్రివేది ఆరోగ్యం క్షీణించడంతో అక్టోబర్ 2న జైపూర్ నుంచి గుర్గావ్‌లోని మెదాంత హాస్పిటల్‌కు తరలించారు. ఆరోగ్యం విషమించడంతో సోమవారం అర్ధరాత్రి మరణించారు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే మృతిపై సీఎం అశోక్ గెహ్లోట్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. కష్ట సమయాల్లోనూ నిబ్బరంగా ఉండేవారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ట్వీట్ చేశారు.

## శామీర్‌పేట వద్ద కారులో భారీగా నగదు పట్టివేత

హైదరాబాద్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): కారులో తరలిస్తున్న భారీ నగదును శామీర్‌పేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు టోల్‌టాక్స్ సమీపంలో ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు.

కారులో రూ.40 లక్షల నగదు ఉండగా.. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. డబ్బులతో సహా వాహనాన్ని.. సదరు వ్యక్తులను స్థానిక స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం అందుకున్న ఏసీపీ ఠాణాకు చేరుకొని ఇంత మొత్తంలో నగదును ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఎక్కడికి తీసుకువెళ్తారనే విషయమై విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, దుబ్బాక ఉప ఎన్నిక కోసమే ఈ డబ్బును తరలిస్తున్నారని సమాచారం. ఓ జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థికి చెందిన డబ్బు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తాం: శివసేన

పట్నా,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): శివసేన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 30నుంచి 40 సీట్లలో పోటీ చేస్తుందని ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ చెప్పారు. బీహార్ రాష్ట్రంలో 50 సీట్లలో పోటీ చేయాలని తమ పార్టీ బీహార్ కార్యకర్తలు కోరుతున్నారని, దీనిపై రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని సంజయ్ చెప్పారు. బీహార్ మాజీ డీజీపీ గుప్తేశ్వర్ పాండే ఎన్నికల బరిలో నిలిస్తే అతనిపై శివసేన అభ్యర్థిని రంగంలో కి దింపుతారా అని ప్రశ్నించగా వేచి చూడండి తానే బీహార్ వెళ్లి దీనికి సమాధానం చెపుతానని సంజయ్ చెప్పారు. సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మృతి ఘటనపై సీబీఐ దర్యాప్తు జరపడంపై శివసేన మాజీ డీజీపీని లక్ష్యంగా చేసుకుంది.

మాజీ డీజీపీ పాండే రాజీనామా చేసి నితీష్ పార్టీ పక్షాన ఎన్నికల బరిలో దిగనున్న నేపథ్యంలో శివసేన బీహార్ ఎన్నికల్లో పోటీ చేయాలని యోచిస్తోంది.

# రాజస్థాన్‌లో మరో దారుణం

### యువతికి మత్తు ఇచ్చి నలుగురు యువకుల అత్యాచారం

జైపూర్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ రాష్ట్రం చురు జిల్లాలో దారుణం జరిగింది. నలుగురు యువకులు ఓ యువతికి కూల్ డ్రింక్‌లో మత్తు కలిపి ఇచ్చి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. చురు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువతి పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసేందుకు సమీప పట్టణంలోని మీ సేవా కేంద్రానికి వెళ్లింది. అక్కడ దరఖాస్తు ఫాం నింపుతుండగా విక్రమ్ అనే వ్యక్తి కనిపించాడు. తెలిసిన వ్యక్తే కావడంతో యువతి అతడి సాయంతో దరఖాస్తు పక్రియ పూర్తిచేసింది.

అనంతరం కూల్ డ్రింక్ తాగుదామనే వంకతో విక్రమ్ ఆమెను బయటకు తీసుకెళ్లాడు. కూల్‌డ్రింగ్ షాప్ దూరం ఉందని చెప్పి తన స్నేహితులకు ఫోన్ చేశాడు. దాంతో ఓ కారులో అతని ముగ్గురు స్నేహితులు వచ్చారు. అనంతరం కూల్‌డ్రింక్స్ తీసుకుని విక్రమ్ గదికి వెళ్లారు. అక్కడ యువతి కూల్‌డ్రింక్‌లో మత్తు కలిపి ఇచ్చారు. ఆమె మత్తులోకి జారుకోగానే నలుగురు కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

ఆ సమయంలో వీడియోలు కూడా తీశారు. జరిగిన విషయం ఎవరికైనా చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా చంపేస్తామని, వీడియోలో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించి పంపించారు. ఇంటికి వెళ్లిన యువతి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందుతులు నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# హింసాకాండ నిరోధించేందుకే అర్ధరాత్రి అంత్యక్రియలు

### హత్రాస్ ఘటనపై సుప్రీంకునివేదించిన యూపి ప్రభుత్వం

న్యూఢిల్లీ,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): పెద్ద ఎత్తున హింసాకాండ చెలరేగకుండా నిరోధించేందుకే హత్రాస్ మృతురాలి అంత్యక్రియులను రాత్రికి రాత్రి జరపాల్సి వచ్చిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు మంగళవారంనాడు తెలియజేసింది. ఈ మేరకు ఒక అఫిడవేట్‌ను అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం రాత్రికిరాత్రి అంత్యక్రియలు నిర్వహించాలనే అసాధారణ నిర్ణయం తీసుకుందని, అది కూడా బాధితురాలి కుటుంబ సభ్యుల సమ్మతితో, వారి సమక్షంలోనే అంత్యక్రియలు నిర్వహించిందని ఆ అఫిడవిట్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 29న సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద ధర్మా జరిగిన తీరు,మొత్తం ఘటనను కుల, మతపమైన రంగుపులిమే అవకాశాలున్నాయన్న ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు జిల్లా యంత్రాంగం రాత్రికి రాత్రి అంత్యక్రియలు పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు కూడా యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. రెండు కులాలకు చెందిన వ్యక్తులతో కలిసి వివిధ రాజకీయల పార్టీల నేతలు, కార్యకర్తలు, మీడియా సిబ్బంది సహా వేలాది మంది మరుసటి రోజు ఉదయం గ్రామానికి చేరనున్నారనే నిర్దిష్ట సమాచారం కూడా అందినట్టు యూపీ ప్రభుత్వం తెలిపింది. బాధితురాలి మృతి, పోస్ట్ మార్టం జరిగి అప్పటికే దాదాపు 20 గంటలు అయిందని, మరుసటి రోజు ఉదయం అంత్రక్రియలు నిర్వహిస్తే పెద్దఎత్తున హింస జరిగే అవకాశం ఉందని గ్రహించిన జిల్లా యంత్రాగం, అదే విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఒప్పించినట్టు ఆ అఫిడవిట్‌లో వివరించింది. ఒకసారి పోస్ట్ మార్టం పూర్తయిన తర్వాత అంత్యక్రియలను వేగవంతం చేయడంలో ఎలాంటి దురుద్దేశం ఉండదని పేర్కొంది.

# మరింతగా విస్తరించనున్న కరోనా

### ప్రపంచ దేశాలు జాగ్రత్తగా ఉండాల్సిందే

### హెచ్చరించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

జెనీవా,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తోన్న కరోనా మహమ్మరి... రానున్న రోజుల్లో మరింతగా విజృంభించనుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ మరోమారు మెచ్చరించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ప్రతి పదిమందిలో ఒకరు కరోనా వైరస్ బారిన పడ్డారని నివేదికలు ఇప్పటికే చెబుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే... డబ్ల్యూహెచ్ఓ... ప్రపంచ దేశాలను హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా... అధిక సంఖ్యలో ప్రజలకు కరోనా నుంచి ముప్పు తప్పదంటూ తీవ్రస్థాయిలోనే హెచ్చరించడం విశేషం. ప్రస్తుతం ప్రతి పది మందిలో ఒకరు కరోనా బారిన పడి, అనారోగ్య సమస్యలనెదుర్కొంటున్నారని వెల్లడించింది. రానున్న రోజుల్లో... కోవిడ్ 19 కారణంగా మరిన్ని విపత్కర పరిస్థితులు తలెత్తనున్నాయని, నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని సూచంచింది. డబ్ల్యూహెచ్ఓ కార్యనిర్వాహక సమావేశం సోమవారం జరిగింది. టాప్ ఎమర్జెన్సీ ఎక్స్‌పర్ట్ మైక్ ర్యాన్ ఈ సమావేశంలో మాట్లాడుతూ..ఆగ్నేయాసియా తో పాటు కొన్ని ఐరోపా దేశాలు, తూర్పు మధ్యధరా ప్రాంతంలో కరోనా కేసుల తీవ్రత పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతాలు, దేశాలు, పట్టణాలు, జాతులు, సమూహాలు అనే వ్యత్యాసం లేకుండా కరోనా వ్యాప్తి చెందుతోందని, కష్టకాలంలోకి వెళ్లబోతున్నామని మైక్ ర్యాన్ పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి ఆగదని చెప్పారు. కరోనా వ్యాప్తికి మూల కేంద్రమైన చైనాలో దర్యాప్తు కోసం అంతర్జాతీయ మిషన్‌లో పాల్గొనే నిఫుణుల జాబితాను ఆమోదం కోసం చైనాకు డ్లబ్యూహెచ్ఓ పంపినట్లు చెప్పారు.

# ప్రమాదంలో గాయపడ్డ అఫ్ఘాన్ క్రికెటర్ నజీబ్ మరణం

### చికిత్స పొందుతూ మృతి చెందాడు- బోర్డు ప్రకటన

కాబూల్,అక్టోబర్6(ఆర్ఎన్ఎ): ఆఫ్గనిస్తాన్ యువ క్రికెటర్, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ నజీబ్ తరకాయ్(29) దుర్మరణం చెందాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక మీడియా కథనం ప్రకారం.. వారం రోజుల కిందట తూర్పు నంగన్‌హర్‌లో రోడ్డు దాటుతున్న క్రమంలో ఓ కారు నజీబ్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. అయితే వైద్యులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నజీబ్ మరణవార్తను అఫ్గనిస్తాన్ క్రికెట్ బోర్డు మంగళవారం ధ్రువీకరించింది. యువ క్రికెటర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బోర్టు.. దేశమంతా విషాదంలో మునిగిపోయిందని ట్వీట్ చేసింది. నజీబ్ మరణం తమకు తీరని లోటు అని, దూకుడుగా ఇన్నింగ్ ఆరంభించే ఓపెనర్, మంచి మనిషిని కోల్పోయామని విచారం వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదంలో అతడు దుర్మరణం పాలయ్యాడని, నజీబ్ లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ సంతాపం తెలిపింది. ఆరు సెంచరీలు చేశాడు ఫ్గనిస్తాన్ క్రికెట్ జట్టు తరపున 12 వన్డేలు ఆడిన నజీబ్.. 2017లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో 90 పరుగులతో రాణించి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 47.20 సగటు కలిగి ఉన్న ఈ బ్యాట్స్‌మెన్.. కెరీర్ మొత్తంలో ఆరు సెంచరీలు చేశాడు. గతేడాది జరిగిన ష్పగిజా క్రికెట్ లీగ్‌లో స్పీన్ ఘర్ టైగర్స్ తరఫున మైదానంలో దిగిన నజీబ్.. టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అదే విధంగా సెప్టెంబరులో మిస్ ఐనాక్ నైట్స్ స్క్వాడ్‌లో అతడు భాగస్వామిగా ఉన్నాడు.

# సబ్బండ వర్ణాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

నల్లగొండ, అక్టోబర్ 6: ప్రభుత్వం వృతిదారుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నార్కట్ పల్లి మండలం అక్కెనపల్లి, అమ్మనబోలు, షాపల్లి గ్రామాల చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. అనంతరం షాపల్లి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అమ్మనబోలులో నూతనంగా నిర్మిస్తున్న రైతు వేదికను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని వృత్తులను కాపాడడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి కోమటిరెడ్డి చరిత, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు సత్తయ్య, నార్కెట్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డిరు, సర్పంచులు కర్నాటి ఉపేందర్, బద్దం వరమ్మ రాంరెడ్డి, ఎంపీటీసీలు కనుకు అంజయ్య, చిర్రబోయిన సావిత్రి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

